క్లుప్తంగా

ప్రధాన రహదారి ధ్వంసం

పట్టించుకోని అధికారులు



ప్రశాంతిహిల్స్ ప్రధాన రహదారి దుస్థితి

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతి హిల్స్ చౌరస్తా సమీపంలో తాగునీటి పైపులైన్ పనుల్లో భాగంగా ప్రధాన రహదారిని తవ్వి వదిలేశారు. పనులు పూర్తయ్యాక మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డంతా కంకర తేలి ధ్వంసమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత పాడైపోయిందని ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి



చెక్కు అందజేస్తున్న జంగారెడ్డి తదితరులు

కందుకూరు: అర్హులందరికీ సంక్షేమఫలాలు అందించేందుకు మంత్రి సబితారెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కల్యాణ్‌నగర్‌కు చెందిన యాదగిరికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60వేల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శనివారం ఆయన తన కార్యాలయంలో లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, కార్యాలయ కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీనివాసులు (ఫైల్)

పహాడీషరీఫ్: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. రంగనాయకుల కాలనీకి చెందిన శ్రీనివాసులు(50) మానసికస్థితి సరిగా లేదు. ఈ నెల 5న సాయంత్రం 7 గంటలకు తన బైక్‌పై బయటికి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై అతని కుమారుడు యాదేష్ కుమార్ పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

చదువుకు మించిన ఆస్తి లేదు

దిల్‌సుఖ్‌నగర్: చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ హాల్‌లో జరిగిన శ్రీరామ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కళాశాల దశ ఎంతో ముఖ్యమైనది అన్నారు.గత ప్రభుత్వాలు విద్య వ్యవస్థను పట్టించుకున్న దాఖలాలు లేవు అని, ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో విద్య రంగ వ్యవస్థ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు.కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రమేష్ , ప్రిన్సిపాల్ శ్యామల, నాగమణి, నాగలత, రవీంద్రం, నాగేశ్వరరావు, వెంకటేశం, రామశేషు, రామలక్ష్మి, సరళ ,యాదగిరి, రాజు, శ్వేత, నవనీత, మానస పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేజ్–1లో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు శర్మ, రంగప్ప, కేఎస్ శర్మ, కృష్ణగౌడ్, శ్రీనివాస్, నాయకులు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అప్పులు

- బిల్లులు మంజూరు చేయడం లేదని సర్పంచ్‌ల ఆగ్రహం
- పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీపీ రఘుమారెడ్డి

మహేశ్వరం: గ్రామాభివృద్ధికి లక్షల రూపాయలు అప్పు చేస్తే ఇప్పటికీ బిల్లులు మంజూరుకాక ఇబ్బంది పడుతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రఘుమారెడ్డి అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు నేటికీ బిల్లులు మంజూరు చేయలేదని చిన్నతూఫ్ర, అమీర్‌పేట్ సర్పంచ్‌లు రఘుపతిగౌడ్, శ్రీశైలంగౌడ్ సభలో ప్రస్తావనకు తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య ఉందని సమస్యను కలెక్టర్‌కు వివరించి నిధులు మంజూరు చేయిస్తామని ఎంపీపీ అన్నారు. నాలుగేళ్లుగా వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని డబిల్‌గూడ, నాగిరెడ్డిపల్లి సర్పంచ్‌లు శంకర్, మనోహర్ అన్నారు. వ్యవసాయాధికారులు నష్ట పరిహారం వేసుకెళ్తున్నారే తప్ప రైతులకు మేలు చేకూరడం లేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామని వ్యవసాయాధికారి నాగమణి అన్నారు. నల్లచెర్వు తండా, పెద్దమ్మ తండాల్లో ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సమస్యలు పరిష్కరించాలని మాణిక్యమ్మగూడ ఎంపీటీసీ సభ్యురాలు అనితానాయక్ అన్నారు. విద్యుత్ ఏఈ స్పందిస్తూ తండాలు, గ్రామాల్లో నెల కొన్న విద్యుత్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. నాగారం, పడమటి తండాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నీటి సామర్థ్యం పెంచాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు లావణ్య, అనితా నాయక్ కోరారు. మిషన్ భగీరథ ఏఈ ప్రణీత్ మాట్లాడుతూ.. గ్రామాలకు సరిపడ నీటిని అందిస్తామన్నారు. చిన్నతూఫ్రలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థలం చూపించాలని సర్పంచ్ రఘుపతిగౌడ్ కోరగా.. త్వరలో గ్రామాన్ని సందర్శించి స్థలం కేటాయిస్తామని తహసీల్దార్ మహమూద్ అలీ అన్నారు. ఉద్యానవన రైతులకు మహేశ్వరంలోనే నారు అందుబాటులోకి తీసుకొచ్చి సబ్సిడీపై అందించాలని మహేశ్వరం ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్ అన్నారు. దుబ్బచర్ల, కల్వకోల్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో బెల్టు షాపులు జోరుగా నడుస్తున్న ఎక్సైజ్ అధికారులు స్పందించడం లేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు స్లీవారెడ్డి, థామస్‌రెడ్డి, మనోహర్ ఆరోపించగా.. చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. నాగారం–కొల్లపడకల్ వయా మన్సాన్‌పల్లి చౌరస్తా బీటీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని.. డబిల్‌గూడ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సర్పంచ్ శంకర్ కోరారు. మండల కేంద్రంలో వీధి కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయని వీటిని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అదిల్ అలీ అన్నారు. ఇందుకు ఎంపీఓ రవీందర్‌రెడ్డి సానుకూలంగా సర్పందించారు. పోరండ్ల గ్రామంలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ శకుంతల ఏఈను కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ సునీతా నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, డీఈ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

> **ఉన్నతంగా అభివృద్ధి చేస్తాం**
>
> మండల పరిధిలో 31 పంచాయతీల్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం.
>
> – రఘుమారెడ్డి, ఎంపీపీ, మహేశ్వరం

యువత క్రీడల్లోనూ రాణించాలి

- మంత్రి సబితారెడ్డి
- జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

మహేశ్వరం: యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మంత్రి జన్మదినం సందర్భంగా సర్పంచ్ మోతీలాల్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం సబితారెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం రిజర్వేషన్ కల్పిస్తోందన్నారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రభుత్వం నగదు బహుమతులు అందించి ప్రోత్సహిస్తోందన్నారు. కేసీ తండా సమీపంలోని కొత్వాల్ చెర్వు కట్టపైన 40 అడుగుల శివుడి విగ్రహం, మరిన్ని ప్రతిమలు ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. పోటీల్లో విజేత జట్టుకు రూ.25 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.15వేల నగదు బహుమతితో పాలుగ షీల్డ్‌లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసీ తండా సర్పంచ్ జాటోత్ మోతీలాల్ నాయక్, ఉప సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, రైతు కమిటీ జిల్లా సభ్యులు కూన యాదయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు నాయక్, ఎన్టీ, దుబ్బచర్ల, కల్వకోల్ సర్పంచ్‌లు రాజు నాయక్, స్లీవారెడ్డి, థామస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, చంద్రయ్య, వీర్యా నాయక్, శివగంగ ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు నవీన్, కుమార్, గోపాల్ నాయక్, మోడల్ స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ రవి నాయక్, వార్డు సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

మానవ అక్రమ రవాణా నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న బడంగ్‌పేట డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

రంగారెడ్డి జిల్లా: ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టక్ రాధిక మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా పరిగణించపడుతుందన్నారు. నేడు ఎంతో మంది మహిళలు, విద్యార్థినులు ఈ అక్రమ రవాణాకు గురిఅవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజలను, గ్రామీణ ప్రాంత సమాజాన్ని అప్రమత్తం చేయాలని కోరారు. ఆర్థిక స్థితిగతులే ఈ అక్రమ రవాణాకు కారణాలుగా అని చెప్పవచ్చన్నారు. ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ మాట్లాడుతూ.. అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పద్మశ్రీ డాక్టర్ సునీత కష్ణన్ ఆధ్వర్యంలో 27 ఏళ్లుగా పోరాడి ఇప్పటి వరకు 26,500 మంది అమ్మాయిలను కాపాడామన్నారు. వారికి పునరావాసం కల్పించామన్నారు. అలాగే విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేశామని వివరించారు. అనంతరం లఘు చిత్రాల ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

ప్రజలను వేధిస్తే ఊరుకోం

ట్రాన్స్‌జెండర్స్‌కు సీఐ జలనేంధర్‌రెడ్డి హెచ్చరిక

హస్తినాపురం: ట్రాన్స్ జెండర్స్ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని, వేలాది రూపాయలు కావాలని ప్రజలను కొందరు వేధింపులకు గురిచేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేవ జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ లో సాక్షితో మాట్లాడారు. ఎక్కడ శుభకార్యాలు జరిగినా పదుల సంఖ్యలో ట్రాన్స్‌జెండర్లు చేరి రూ. 20 వేలు నుంచి రూ. 30 వేలు కావాలని డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇవ్వకపోతే వారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. వారు తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగార్జునసాగర్ రోడ్డుపై సాగర్‌కాంప్లెక్స్, గుర్రంగూడ చౌరస్తా దగ్గర, ఇంజాపూర్ రోడ్డు దగ్గర , విజయవాడ జాతీయ రహదారి ఆటోనగర్‌లో ట్రాన్స్‌జెండర్లు రాత్రి వేళల్లో తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వారి ప్రవర్తలో మార్పు తెచ్చేందుకు ఇప్పటికే పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఇప్పటి నుంచి పోలీస్‌స్టేషన్ పరిధిలో షాపులు ప్రారంభిస్తున్న, శుభాకార్యాలు చేసుకుంటున్న వారి వద్దకు వెళ్లి డబ్బులు కోసం వేధింపుల కు పాల్పడితే సహించేది లేదని సీఐ హెచ్చరించారు.

హైకోర్టు పీపీకి సత్కారం

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన శ్రీనివాస్‌ను శనివారం వనస్థలిపురంలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఆర్‌వీ లక్ష్మి, ఉపాధ్యక్షుడు మంద సురేందర్‌రెడ్డి, పీఆర్‌ఓ బిజ్జాల యాదగిరి గుప్తా, సభ్యులు కొండ వెంకట్‌రెడ్డి, వంగూరి యాదగిరి యాదవ్ పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను కాపాడండి

హయత్‌నగర్: అన్మగల్ హయత్‌నగర్‌లోని వక్ఫ్ బోర్డుకు చెందిన భూమిని కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని, అధికారులు వెంటనే స్పందించి ఆ భూమిని పరిరక్షించాలని టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ శనివారం వక్ఫ్ బోర్డులో వినతి పత్రం సమర్పించారు. సర్వే నంబర్ 88, 89, 145ల్లో సుమారు 3.36 ఎకరాల భూమి ఉందని, ఈ భూమిలో గతంలో కొందరు ముస్లిలు మసీద్ నిర్మాణానికి యత్నించగా కబ్జాదారులు వారిని బెదిరించి పంపేశారన్నారు. ఆక్రమణదారులు ఇక్కడ ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని కొంతమంది వద్ద డబ్బులు కూడా వసూలు చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల ఆశలో పేదలు మోసపోకుండా ఉండేందుకు వక్ఫ్ బోర్డు వారు వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని భాస్కర్ డిమాండ్ చేశాడు.

లీడర్‌షిప్ ట్రైనింగ్‌కు 'హోం' విద్యార్థులు



విద్యార్థులతో హోం సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి తదితరులు

హుడాకాంప్లెక్స్: గుజరాత్‌లోని ఒయాసిస్ యూనివర్సిటీలో మిసాల్ డ్రీమ్ ఇండియా క్యాంప్ లీడర్‌షిప్ ట్రైనింగ్‌కు సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హోం సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, ప్రిన్సిపాల్ వడ్డేపల్లి ప్రభుదాస్ మాట్లాడుతూ.. ఈ నెల 7 నుంచి 21 వరకు నిర్వహించే ట్రైనింగ్‌కు పది మంది విద్యార్థులు ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ భాస్కర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు పరిష్కారం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఉన్నతాధికారులతో ప్లాట్ల క్రమబద్ధీకరణపై చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: త్వరలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో దశాబ్దాల తరబడి పెండింగ్ ప్లాట్లు, ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యకు జీఓ 118 ప్రకారం శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ల్యాండ్ రెవెన్యూ అండ్ రిజిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాహుల్ బొజ్జా, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్స్ హరీష్, అమయ్ కుమార్‌లను జిల్లా కలెక్టరేట్‌లో కలిసి జీఓ 118 పై ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. పెండింగ్ రిజిస్ట్రేషన్ సమస్యను ఎదుర్కొంటున్న కొన్ని ఇళ్ల, ప్లాట్లను అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలించారని, వారికి 15 రోజుల్లో కన్వేయాన్స్ డీడ్ అందించాలని అధికారులను సుధీర్‌రెడ్డి కోరారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ సమస్య ఉన్న కాలనీల్లో అధికారులు త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. డీడ్ అందుకున్న ఇంటి యజమానులు స్టాంప్ డ్యూటీ గజానికి రూ.250లు, మ్యూటేషన్ ఫీజు రూ. 3550తో పాటు స్టాంప్ డ్యూటీపై అదనంగా 7.5 శాతం అధికారులకు నేరుగా చెల్లిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. వెరిఫికేషన్ పూర్తయి డిమాండ్ నోటీసులు రానివారు ఈసేవ, మీసేవ లేదా.. ఆయా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల వద్దకు వెళ్లి పరిశీలన చేసుకోవాలని కోరారు. జీఓ 118 సవరణ ప్రకారం సర్వే, ఇంటి నంబర్, ఇంటి యజమాని పేరు తప్పుగా వచ్చినట్లైతే సరిదిద్దుకునే అవకాశం కూడా ఆప్షన్‌లో కల్పిస్తారన్నారు. అధికారులను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, కటికరెడ్డి అరవిందరెడ్డి, బాధిత కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రాంబాబు, జగన్మోహన్, అనసూయ, పుల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శరత్‌రెడ్డి, గోపాల్ ముదిరాజ్, అంజిరెడ్డి, మల్లేష్, మల్లికార్జున్, శేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. చక్రతీర్థం

మీర్‌పేట: జిల్లెలగూడ వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం దేవతా మూర్తులకు చక్రతీర్థం, ఆరాధన సేవాకాలం, నిత్యహోమాలు, బలిహరణం, మహా పూర్ణాహుతి, అమృతోత్సవం, తీర్థప్రసాదగోష్టి, అశ్వ వాహన సేవ, దీపోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్త యాదగిరి ముదిరాజ్, అర్చకులు రామాచారి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు చేసిన మంత్రి సబితారెడ్డికి కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



చక్రతీర్థంలో పాల్గొన్న భక్తులు

పెండింగ్ బకాయిలు చెల్లించండి

వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కుమార్



మే డే ఉత్సవాల్లో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కూలీలు

కందుకూరు: ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అంకగళ్ల కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కందుకూరు గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో మేడే వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎర్ర జెండా ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగు నీరు అందుబాటులో ఉంచకపోవడం బాధాకరమన్నారు. రోజు ఎంత పని చేస్తుంది తెలిపేలా ప్రతీ వారం పే స్లిప్‌లు ఇవ్వాలని కోరారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఉపాధిహామీ పథకానికి బడ్జెట్ తగ్గించడం సిగ్గుచేటని విమర్శించారు. 200 రోజుల పనిదినాలు కల్పిస్తూ రోజుకు రూ.600 చొప్పున కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శేఖర్, కుమార్, సత్తయ్య, కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి'



ముద్ద కల్యాణ్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్

హస్తినాపురం: ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో రానున్న సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాల్సిన అవసరం ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శనివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన ముద్ద కల్యాణ్‌కు కార్పొరేటర్ శాలువా కప్పి సత్కరించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, చంపాపేట డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రహమాన్ సోఫీ



ఆర్టీసీ కాలనీలో సమావేశమైన రిటైర్డ్ ఉద్యోగులు

వనస్థలిపురం: టీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న హయత్‌నగర్‌లోని బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర 10వ మహాసభను విజయవంతం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ రహమాన్ సోఫీ, ప్రధాన కార్యదర్శి బీవీ కోటయ్య, కోశాధికారి ఎస్.బుచ్చిరెడ్డి కోరారు. శనివారం వనస్థలిపురం ఆర్టీసీ కాలనీలో వారు విలేకరులతో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులు 30 వేలకు పైగా ఉన్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకోవాలని అన్నారు. మెడికల్ స్కీంలో ఇప్పటి వరకు చేరని వారికి అవకాశం కల్పించాలని, అంతర్రాష్ట్ర సర్వీసులలో భార్యాభర్తలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. పెన్షన్ సౌకర్యం లేనందున ఆసరా పెన్షన్, తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మహాసభకు హోం మంత్రి మహమూద్ అలీ, వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి, రవాణా శాఖా మంత్రి పి.అజయ్‌కుమార్, టీఎస్ఆర్టీసీ చైర్మన్ బి.గోవర్ధన్, అసోసియేషన్ గ్రేటర్ అధ్యక్షుడు ఎం.రాంమోహన్‌గౌడ్ తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కె. సత్యం, బి.రామచంద్రగౌడ్, మనోహర్, యూసఫ్, సిద్దిఖీ, జాఫర్, యాదగిరి, ఎల్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.